

# బీసీ వెల్ఫేర్‌లో బదిలీలలు!

బీసీ వెల్ఫేర్(వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ)లో బది'లీల' వ్యవహారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో తీవ్ర వివాదాస్పదంగా మారింది. బదిలీల మాటున రూ.లక్షల్లో బేరసారాలు జరిగినట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకునేవారికి అధికారులే ఫోన్లు చేసి బెదిరిస్తుండటం సంచలనం సృష్టిస్తోంది. డైరెక్టరేట్ ఆదేశాలను ధిక్కరించి.. బదిలీల మార్గదర్శకాలను తుంగలో తొక్కి, కాసులు విదిల్చిన వారికే రెడ్ కార్పెట్ పరుస్తుండటంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి భోజనానికి అనుగుణంగా నిర్దేశించిన బదిలీల జాబితా కలెక్టర్ దగ్గరకు చేరింది. ఈ జాబితాపై కలెక్టర్ విచారణకు ఆదేశించాలని, లేని పక్షంలో అర్హులకు అన్యాయం చేసినట్టు అవుతుందని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉమ్మడి కృష్ణాజిల్లా వార్డెన్ల బదిలీల్లో రూ.లక్షల్లో అవినీతి!

**డైరెక్టరేట్ ఉత్తర్వులు, బదిలీ నిబంధనలు బేఖాతరు**

- బదిలీలకు దరఖాస్తు చేసుకునే వారికి అధికారుల బెదిరింపులు
- ఫ్రీ కౌన్సెలింగ్ పేరుతో బేరసారాలు!
- దీనిపై విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌కు ఆ శాఖ ఉద్యోగుల వినతి




(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నడూలేని విధంగా బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌ను అవినీతి వివాదాలు ముప్పేట చుట్టుముడుతున్నాయి. తాజా బదిలీల వ్యవహారంలో బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు వ్యవహరిస్తున్న ఏకపక్ష విధానాలు అనేక ఆరోపణలకు కారణమవుతున్నాయి. రూ.లక్షలు కొట్టిన వారికి నిబంధనలకు విరుద్ధంగా కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్‌లు కల్పించటం వివాదం సృష్టిస్తోంది. బదిలీలు పారదర్శకంగా జరగటం లేదని బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసే వరకు వెళ్లటం గమనార్హం.

### ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా..

ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. దీని కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి జాబితాను రూపొందించి వెకెన్సీ పొజిషన్‌ను ఉన్నతాధికారులు చూపించాల్సి ఉంటుంది. ఈ వేకెన్సీ పొజిషన్ ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బదిలీల సందర్భంగా ముందుగా ఐదు సంవత్సరాలు ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికే బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. కొన్ని అంశాలకు సంబంధించి రిక్వెస్ట్ బదిలీలు కూడా ఉంటాయి. ఈ రిక్వెస్ట్ బదిలీలు అనేవి ముందు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు కల్పించిన తర్వాత చూడాల్సి ఉంటుంది. కానీ, రిక్వెస్ట్ బదిలీలకు బీసీ వెల్ఫేర్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు ప్రాధాన్యత ఇవ్వటం గమనార్హం. ఈ వ్యవహారంలో కిరికిరి నడిచిందన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. రిక్వెస్ట్ బదిలీల మాటున లక్షలాది రూపాయల ముడుపులు చేతులు మారినట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ పెట్టుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వటం సంచలనం సృష్టిస్తోంది. హాస్టల్ వార్డెన్స్ బదిలీల్లో నిబంధనల ప్రకారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏబీసీడబ్ల్యూవో) ద్వారా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ (డీబీసీడబ్ల్యూవో)కు వెళ్లాల్సి ఉండగా.. ఈ ప్రొసీజర్‌ను బీసీ వెల్ఫేర్‌లో అస్సలు అనుసరించటం లేదు. జిల్లా బీసీ వెల్ఫేర్ (కృష్ణా) అధికారులు డైరెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం కాలేజీ నుంచి వచ్చిన వారికి కాలేజీలలోనూ, హాస్టల్ వారికి హాస్టల్, ప్రీ మెట్రిక్ వారికి ప్రీ మెట్రిక్ స్థానాలలో మాత్రమే పోస్టింగ్‌లు కల్పించాల్సి ఉంది. కానీ ఇష్టానుసారంగా కాలేజీ నుంచి వచ్చిన వారికి ప్రీ మెట్రిక్‌లో పోస్టింగ్‌లు కల్పిస్తూ బదిలీలు నిర్వహించారు.

### పదేళ్లుగా ఒకేచోట..!

విజయవాడ సెంట్రల్‌లో గుణదల కాలేజీ హాస్టల్‌లో పనిచేసే వార్డెన్ గత పది సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్నారు. గతంలో ఐదేళ్లు పనిచేసిన ఆమెను ఆరో ఏట ఇబ్రహీంపట్నం బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నం వెళ్లిన ఆమె వెంటనే డిప్యూటేషన్ మీద గుణదల వచ్చేశారు. జీతం తీసుకునేది ఇబ్రహీంపట్నం అయినప్పటికీ పనిచేసేది మాత్రం గుణదలలోనే కావటం గమనార్హం. ఇప్పటికి పదేళ్లుగా అదే సీటులో ఉంటున్నారు. తాజా బదిలీల సందర్భంగా ఇబ్రహీంపట్నంలో పనిచేస్తున్నట్టుగా చెప్పుకుంటూ మళ్లీ గుణదలలోనే సెటిల్ అవ్వటానికి బదిలీకి చేసిన ప్రయత్నాన్ని అధికారులు సాకారం చేశారు. ప్రీ కౌన్సెలింగ్ పేరుతో ఆమెకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి.

### షాడో బెదిరింపులు

గుడ్లవల్లేరు కాలేజీ హాస్టల్‌లో పనిచేస్తున్న ఓ వార్డెన్‌కు ఇంకా ఐదు సంవత్సరాలు నిండలేదు. ఈ వార్డెన్ చాలా ఓవర్. ఆయనకు డైరెక్టరేట్‌తో, డైరెక్టరేట్‌కు ఆయనతో అవసరం ఉందని చెప్పుకుంటారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేయకపోయినా.. రిక్వెస్ట్ పెట్టుకుని విజయవాడ తూర్పుకు లైన్ క్లియర్ చేసుకున్నట్టు సమాచారం. ఇదే స్థానానికి నిబంధనలకు అనుగుణంగా ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నందిగామ కాలేజీ హాస్టల్ వార్డెన్ విజయవాడ తూర్పుకు ఆప్షన్ పెట్టుకున్నారని తెలిసింది. ఆ వార్డెన్‌కు నాలుగేళ్ల బాబు ఉన్నాడు. ఆటిజంతో బాధ పడుతున్నాడు. విజయవాడలో ఉంటే మెరుగైన వైద్యం చేయించుకోవచ్చన్న ఉద్దేశ్యంతో ఆ వార్డెన్ విజయవాడ తూర్పుకు దరఖాస్తు చేసుకుంటే.. గుడ్లవల్లేరులోని షాడో ఒకరు.. రావటానికి వీల్లేదంటూ ఆ మహిళా వార్డెన్‌పై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. విజయవాడ



# ఇంద్రకీలాద్రిపై.. మినీ ఫ్లై ఓవర్!

దుర్గగుడిపై ప్రతిపాదిత మినీ ఫ్లైఓవర్

## 265 మీటర్ల పొడవు, 16 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదన

- ప్రతిపాదిత రెండో నూతన ఘాట్ మార్గానికి బదులుగా..
- కుమ్మరిపాలెం వైపు నుంచి నేరుగా ఘాట్ మార్గానికి అనుసంధానం
- ఎన్‌హెచ్ - 65 నుంచి కొండమీదకు మినీ ఫ్లైఓవర్
- ఓం టర్నింగ్ దగ్గర దిగువన 11 అంతస్తుల మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్
- ఘాట్ మార్గానికి నేరుగా అనుసంధానం

**1500 వాహనాలకు పార్కింగ్ అవకాశం**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద దేవస్థానమైన ఇంద్రకీలాద్రిపై ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. కుమ్మరిపాలెం వైపు రెండో ఘాట్ మార్గాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తున్న తరుణంలో ఘాట్ మార్గం స్థానంలో ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి నిర్ణయించారు. ఈ ఫ్లైఓవర్ కొండ మీద టర్నింగ్ వరకు 265 మీటర్ల మేర నిర్మించాలన్న ప్రతిపాదనను ఆయన రూపొందించారు. ఓ ప్రైవేటు కన్సల్టెన్సీతో పాటు విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కాలేజీ (స్పా), సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ బృందంతో సంయుక్తంగా ప్రతిపాదిత నూతన ఘాట్ మార్గంలో ఫ్లైఓవర్‌కు ప్రతిపాదన డిజైన్స్ రూపొందించారు. ఇది దిగువన ఉన్న ఎన్‌హెచ్ - 65 నుంచి ప్రతిపాదిత నూతన ఘాట్ అలైన్‌మెంట్ మీదుగా టర్నింగ్ వరకు నిర్మించి ప్రధాన ఘాట్‌మార్గానికి అనుసంధానిస్తారు.

### కూటమి ప్రభుత్వం రాకతో..

ఇంద్రకీలాద్రిపై రెండో ఘాట్ మార్గాన్ని అభివృద్ధి పరచాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇది కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనికి అడుగులు పడ్డాయి. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి దుర్గగుడి అభివృద్ధి మిగతా 6లో..

బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలి 6

# తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడు

## ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- మొత్తం కౌన్సిల్ సభ్యులు 20 మంది
- ఎమ్మెల్యే ఓటుతో 11కు చేరిన టీడీపీ బలం
- చైర్మన్ పదవి టీడీపీకి లాంఛనమే!



బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో కె.మాధురి

తిరువూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మున్సిపల్ ఎన్నికల అధికారి, ఆర్డీవో కె.మాధురి మున్సిపల్ కమిషనర్ జి.లోవరాజుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్ఐ సెక్టార్-1 కె.వి.జి.వి.సత్యనారాయణ, ఎస్ఐ-2 జి.వెంకటేశ్వరరావులకు బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం నుంచే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్లను బారికేడ్లతో మూసివేశారు. కాగా, గత నెల 19, 20 తేదీల్లో ఈ ఉప ఎన్నిక జరగాల్సి ఉండగా, కోరం లేకపోవడంతో ఎన్నిక రద్దుచేశారు. తిరిగి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు సోమవారం ఎన్నిక నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిపి మొత్తం 21 ఓట్లు ఉన్నాయి. ఒక సభ్యురాలు అమెరికాలో ఉండటంతో 20 ఓట్లకు గాను, పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలబడటంతో టీడీపీ బలం అనూహ్యంగా 11కు చేరింది. వైసీపీ బలం 17 నుంచి 9కి పడిపోయింది. సోమవారం జరిగే ఉపఎన్నికలో సంఖ్యాబలం లేకపోయిన వైసీపీ సభ్యులు పాల్గొనే అవకాశం ఉండటంతో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మరో ఇద్దరు టీడీపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

వెబ్ ఆప్షన్లు ఇవ్వని స్కూల్ అసిస్టెంట్లు! 6

# అనాథ బాలికపై దాష్టీకం

## వేసవి సెలవులకు వెళ్లలేదని స్కేలుతో కొట్టిన బాలసదన్ సూపరింటెండెంట్

- సూపరింటెండెంట్ నిర్వాకంపై పలువురి ఆగ్రహం
- తల్లిదండ్రులు లేని చిన్నారి ఎక్కడకు వెళ్తుందని నిలదీత
- ఏడుస్తున్న చిన్నారి వద్దకు వచ్చిన వారితో సూపరింటెండెంట్ వాగ్వాదం
- సెల్‌ఫోన్ల నుంచి వీడియోలు తొలగించాలని డిమాండ్
- ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి..



మచిలీపట్నంలోని బాలసదన్ (ఇన్‌సెట్‌లో) చిన్నారి పామర్తి దుర్గ

తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు ఆశ్రయం కల్పించాల్సిన మచిలీపట్నంలోని బాలసదన్ అనేక విమర్శలను ఎదుర్కొంటోంది. వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లలేదని ఓ అనాథ బాలికపై బాలసదన్ సూపరింటెండెంట్ శనివారం ఇనుప స్కేలుతో తీవ్రంగా కొట్టింది. బాలిక బిగ్గరగా ఏడవటంతో సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయం సిబ్బంది, అక్కడకు పనిపై వచ్చిన వారు బాలసదన్‌కు పరిగెత్తుకొచ్చారు. తల్లిదండ్రులు లేని చిన్నారి ఎక్కడకు వెళ్తుందని సూపరింటెండెంట్‌ను నిలదీశారు. వారితో వాగ్వాదానికి దిగిన సూపరింటెండెంట్ మీ సెల్‌ఫోన్లలో ఈ ఘటనపై తీసిన వీడియోలు, ఫొటోలు తొలగించాలని డిమాండ్ చేసింది. దీనిపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : బంటుమిల్లికి చెందిన పామర్తి దుర్గ తల్లిదండ్రులు చనిపోవడంతో మచిలీపట్నంలోని బాలసదన్‌లో ఉంటోంది. బాలసదన్‌కు సమీపంలో ఉన్న రాంజీ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల పేర్లు కూడా ఈ చిన్నారి చెప్పలేనిస్థితి. బాలసదన్‌లో 20 మంది వరకు పిల్లలు ఉంటారు. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో ఇక్కడ ఉండే పిల్లలు వారి బంధువుల ఇళ్లకు వెళ్లారు. పామర్తి దుర్గకు నా అనే వారు ఎవరూ లేకపోవడంతో బాలసదన్‌లోనే ఉండిపోయింది. సెలవుల్లోనూ దుర్గ ఇక్కడే ఉండిపోయిందనే కారణంతో తరచూ ఆ చిన్నారిపై అక్కడ పనిచేసే సూపరింటెండెంట్ చికాకును ప్రదర్శిస్తోందని చుట్టుపక్కల గృహాలవారు, ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో బాలసదన్ నుంచి బాలిక ఏడుపు పెద్దగా వినిపించడంతో ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, కార్యాలయంలో పనిమీద వచ్చినవారు అక్కడకు పరిగెత్తారు. బాలిక గదిలో ఉండి బిగ్గరగా ఏడుస్తుండటంతో ఏం జరిగిందని అక్కడ పనిచేసే సూపరింటెండెంట్‌ను అడిగారు. మా కార్యాలయంలోకి మీరెందుకు వచ్చారంటూ ఆమె ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందితో పాటు అక్కడకు వచ్చిన వారితో వాగ్వివాదానికి దిగింది. బాలికను ఇనుప స్కేలు అంచుతో కొట్టిందని గ్రహించిన వారు వీడియో తీశారు. ఆ సమయంలో ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేసే ఒక మహిళా ఉద్యోగి బాలసదన్‌లో బాలికపై దాడి చేసిన సూపరింటెండెంట్‌కు మద్దతుగా నిలిచి వీడియోలు తీయకుండా అడ్డుపడింది. అనాథ మిగతా 6లో..

బియ్యం అక్రమంగా తరలిపోకూడదనే..
- పారదర్శకంగా డిపోల వద్ద పంపిణీ
- దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే..
- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
- మంత్రి కొల్లు రవీంద్ర
6

కల్యాణ మండపాల్లో 'బంగారం శ్రీను'
- బెజవాడలో రెండుచోట్ల లీజుల్లో భాగస్వామ్యం
- వాసవీ క్లబ్‌లో పరిచయమైన వారితో వ్యాపారం
6

రైతులకు భరోసాగా భవిష్యత్తు కార్యాచరణ
- ఆహార ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు కృషి
- 'విజయ' చైర్మన్ చలసాని ఆంజనేయులు
6



# సాఫీగా..

## చౌక దుకాణాల దగ్గర నిత్యావసరాల పంపిణీ

- ఎన్టీఆర్ జిల్లాలో 67,138 మంది, కృష్ణాజిల్లాలో 56,410 మందికి చేరిన సరుకులు
- తొలిరోజు స్వల్పంగా సర్వర్ సమస్యలు.. అధిగమించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రేషన్ దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీ తొలి రోజు ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాఫీగా సాగింది. ఐదేళ్ల తర్వాత మళ్లీ చౌక దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ నేపథ్యంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను అందించారు. ఈ పోస్‌ల ద్వారా లావాదేవీలు నిర్వహించటానికి స్వల్పంగా సర్వర్ సమస్యలు వచ్చాయి. రేషన్ డీలర్ల దగ్గర నిత్యావసరాలు తీసుకోవటం అన్నది తమకేమీ ఇబ్బంది లేదని పలువురు కార్డుదారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రేషన్ డిపోలు అయితే నచ్చినపుడు వచ్చి నిత్యావసరాలను తీసుకుంటామని, అదే ఎండీయూ వాహనం అయితే ఒక్క రోజు మాత్రమే అన్ని పనులు మానుకుని నిత్యావసరాలు తీసుకోవాల్సి వస్తుందని, అది ఒక రకంగా ఇబ్బందికరంగా ఉండేదని చెప్పారు. తొలి రోజు రాత్రి 9.30 గంటల వరకు చూస్తే .. ఎన్టీఆర్ జిల్లాలో 957 రేషన్ షాపుల వద్ద 5,90,243 మంది కార్డు దారులకు గాను 67,138 మంది నిత్యావసరాలను తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తొలి రోజున 11.06 శాతం మేర నిత్యావసరాల పంపిణీ జరిగింది. కృష్ణా జిల్లా వ్యాప్తంగా చూస్తే మొత్తం 1,059 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,22,589 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరిలో తొలి రోజున 56,410 మంది కార్డుదారులు నిత్యావసరాలను తీసుకున్నారు. కృష్ణాజిల్లాలో 10.39 శాతం నమోదైంది.

### 15 రోజుల వెసులుబాటు..

గతంలో వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ డోర్ డెలివరీ అని చెప్పినప్పటికీ ఎప్పుడూ అది జరగలేదు. ఏదో ఒక వీధిలో వ్యానును నిలిపి నిత్యావసరాలను పంపిణీ చేసేవారు. దీంతో ఆ వ్యాను దగ్గర ప్రజలు బారులుతీరి కనిపించేవారు. ఇప్పుడు డిపోల దగ్గర ఏమంత పెద్ద రష్ కనిపించలేదు. పదిహేను రోజుల సమయం ఉండటంతో కార్డుదారులు తక్కువ సంఖ్యలోనే వచ్చారు. వెంటనే నిత్యావసరాలు తీసుకుని వెళ్లిపోయారు. అప్పుడంటే ఆప్షన్ లేదు ఆ ఒక్క రోజే సరుకులు తీసుకోవాలి కాబట్టి ఎండీయూ వాహనాల దగ్గర బారులు తీరేవారు. ప్రస్తుతం 15 రోజులలో ఎప్పుడైనా డీలర్ల దగ్గర నిత్యావసరాలు తీసుకోవటం ద్వారా ఆ ఇబ్బందులు లేవని చెబుతున్నారు.

### సాగరతీరంలో సందడి



హంసలదీవి సాగర తీరంలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. వివిధ వాహనాల్లో కుటుంబ సమేతంగా తరలివచ్చిన పర్యాటకులు తనివితీరా సముద్ర స్నానాలు ఆచరించారు. మెరైన్ పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు. -ఆంధ్రజ్యోతి-కోడూరు



మచిలీపట్నంలో వృద్ధురాలి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తదితరులు



జంక్షన్ ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పాలప్యాకెట్లు పంపిణీ చేస్తున్న చలసాని ఆంజనేయులు

## రైతులకు భరోసాగా భవిష్యత్తు కార్యాచరణ

» ఆహార ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు కృషి

» 'విజయ' చైర్మన్ చలసాని ఆంజనేయులు

**హనుమాన్‌జంక్షన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వంతో పాటు రైతులు పండించిన ఆహారధాన్యాలకు మద్దతు ధరను కల్పించేందుకు కృష్ణామిల్క్ యూనియన్ భవిష్యత్ కార్యచరణ ప్రణాళిక రచన చేస్తున్నట్టు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. ప్రపంచ పాలదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు చలసాని పాలప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మనిషికి అన్నిరకాల పోషక విలువలతో కూడిన ఆహారం అవసరమన్నారు. సమగ్రమైన పోషక విలువలు పాలు, పాలపదార్థాల్లో లభ్యమవుతాయన్నారు. వాటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. భవిష్యత్‌లో విజయ బ్రాండ్‌తో కలుషితం లేని ఆహార ధాన్యాలను ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. జాతీయస్థాయి సహకార భారతిలో కృష్ణామిల్క్ యూనియన్‌కు స్థానం దక్కడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్ హరిబాబు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

» వడ్డే శోభనాద్రీశ్వరరావు

**గాంధీనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీ2+ 50శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతుల ఆత్మహత్యల నుంచి కాపాడేందుకు 2006లో ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ సిఫార్సులను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ సిఫార్సులను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, అత్యధిక సాగు చేసే ధాన్యానికి క్వింటాకు కేవలం రూ.69 మాత్రమే పెంచడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్న ముడి ఆయిల్‌పై 42 శాతానికి సుంకం పెంచి దేశీయ పామాయిల్ రైతులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల పెంపుకోసం ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పలువురు నేతలు రైతాంగానికి పిలుపునిచ్చారు. సీనియర్ రైతునేత వైకేశవరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ప్రధానకార్యదర్శి పి.జమలయ్య, ఆల్ ఇండియా కిసాన్ మహాసభ నేత డి.హరినాథ్, ఏపీ రైతుకూలీ సంఘం నేత వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## వెబ్ ఆప్షన్లు ఇవ్వని స్కూల్ అసిస్టెంట్లు!

**మచిలీపట్నం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణాజిల్లాలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు ఆదివారం వెబ్ ఆప్షన్లను ఇవ్వలేదు. 1, 2 తేదీల్లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు తాము బదిలీ కోరుకునే పాఠశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. జిల్లాలో 4900 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేశారు. వివిధ యాజమాన్యాలకు చెందిన 8 సంవత్సరాల సర్వీసు నిండిన స్కూల్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొన్ని సాంకేతిక ఇబ్బందుల వల్ల ఎవరికి వారు బదిలీలు కోరుకునే పాఠశాలలు ఆప్షన్ ఆన్‌లైన్‌లో పొందుపరచలేకపోయారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులను భర్తీచేసిన అనంతరం స్కూల్ అసిస్టెంట్ల వెబ్ ఆప్షన్లు ఇచ్చే విధంగా అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 470 మోడల్ ప్రైమరీ పాఠశాలలను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించవలసి ఉంది. ప్రధానోపాధ్యాయులుగా సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లతో పాటు స్కూల్ అసిస్టెంట్లను నియమించేందుకు యోచిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా జూనియర్ స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని సూచనలిస్తున్నారు. ఈ సూచనలకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంగీకరించడం లేదు. ఇలా మొదటి రోజు స్కూల్ అసిస్టెంట్‌లు ఎవరూ తాము కోరుకునే పాఠశాలలకు వెబ్ ఆప్షన్ ఇవ్వలేకపోయారు. సోమవారం నాడైనా స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్ కోరుకునే అవకాశాలు ఉన్నాయి.

## రౌడీషీటర్లపై పోలీసుల తీరు సరైనదే!

» జాతీయ బీసీ సంక్షేమ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి ఎలగాల నూకాలమ్మ

**విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):** తెనాలి రౌడీ షీటర్లపై పోలీసులు వ్యవహరించిన తీరు సరైనదేనని జాతీయ బీసీ సంక్షేమ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి ఎలగాల నూకాలమ్మ అన్నారు. లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్‌లో పెట్టే పోలీసులపై ఎవరైనా గంజాయి మత్తులో దాడి చేస్తే ఏ విధమైన చర్యలు ఉంటాయో ఈ సంఘటన చూస్తే తెలుస్తుందని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది చూసిన తరువాత తప్పు చేయాలనే వారి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ప్రజలను రక్షించే పోలీసులపై రౌడీషీటర్లు దాడిచేసి చంపాలని చూస్తే వారికి కుల సంఘాలు వత్తాసు పలకడం దేనికి సంకేతమని ఆమె ప్రశ్నించారు. రౌడీషీటర్లతో తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసిన చిరంజీవి ఒక బీసీ బిడ్డ అని, ఆయన ఒక దళిత అనాథ మహిళను వివాహం చేసుకున్నారనే విషయాన్ని ఈ కులసంఘాలు గుర్తించాలని ఆమె అన్నారు. రౌడీ షీటర్లైన దళితులు గంజాయి మత్తులో చిరంజీవిని చంపి ఉంటే దళిత మహిళకు అన్యాయం జరిగి ఉండేదన్నారు. కొందరు దళిత సంఘాల ముసుగులో నేతల ప్రోత్సాహంతో రౌడీషీటర్లను వెనకేసుకు రావడం, పోలీసులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. నిజంగా దళితులకు అన్యాయం జరిగితే దళిత సంఘాలతో పాటు బీసీసంఘం కూడా పోరాటానికి సిద్ధమని తెలిపారు. రౌడీషీటర్లకు, హంతకులకు మద్దతుగా కులసంఘాలు చేసే పోరాటం కుల సంఘాల ఐక్యతను దెబ్బతీస్తుందని ఆమె వ్యాఖ్యానించారు.



రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణ, కలెక్టర్ బాలాజీ



విద్యాధరపురం రేషన్ డిపోలో సరుకులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, యనమలకుదురు రేషన్ షాపులో..

# బియ్యం అక్రమంగా తరలిపోకూడదనే..

» పారదర్శకంగా డిపోల వద్ద పంపిణీ

» దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దే..

» అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

» షాపుల పునఃప్రారంభంలో మంత్రి రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** చౌకబియ్యం పక్కదోవ పట్టకుండా రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం రాజుపేటలో ఆదివారం చౌకడిపోను కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి పునఃప్రారంభించారు. కార్డుదారులకు 5 కిలోల బియ్యం, అరకిలో పంచదార, కిలో కందిపప్పులను మంత్రి అందజేశారు. వృద్ధురాలు బోయిన సుశీల, గొడవర్తి మహాలక్ష్మిల ఇళ్లకు మంత్రి, కలెక్టర్ వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల వినతుల మేరకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు సమీక్షించి చౌకడిపోలను పునఃప్రారంభించారన్నారు. గతంలో బియ్యం పక్కదోవ పట్టిందని, కాకినాడ నుంచి సముద్రమార్గంలో ఇతర ప్రాంతాలకు పోయిందన్నారు. చౌక బియ్యం ఒక స్కాంలా గత ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజలకు పారదర్శకత లక్ష్యంతో చౌక డిపోల ద్వారా రేషన్ సరుకులను పునఃప్రారంభించామన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 70 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా మరో 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. బియ్యం వద్దనుకునే వారికి నగదు, లేదా రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, చౌక డిపోల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా పౌరసరఫరాల అధికారికి ఫోన్ చేయవచ్చన్నారు. డీఎస్‌వో వి.పార్వతి, ఆర్డీవో కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ జిల్లాలో ప్రారంభించిన కలెక్టర్ లక్ష్మీశ

**విద్యాధరపురం :** రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం విద్యాధరపురంలోని డీలర్ గురునాథం రేషన్ డిపోలో సరుకులను కార్డుదారులకు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 957 రేషన్ షాపుల ద్వారా 5,90,243 కార్డుదారులకు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో దివ్యాంగులు, 65ఏళ్ల పైబడిన 57,690 మంది కార్డుదారులను గుర్తించామని, వారికి ఇంటి వద్దనే రేషన్ డీలర్లు సరుకులు తీసుకువెళ్లి అందజేస్తారన్నారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు దివ్యాంగులు, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఇంటికే రేషన్ సరుకులు తీసుకువెళ్లి అందజేయాలని ఆదేశించామన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా 1 నుంచి 15లోగా సరుకులు సరఫరా చేయాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చామని, ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచి సరుకులు అందచేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, దానిపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కానింగ్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, డీఎస్‌వో ఎ.పాపారావు, ఎ.ఎస్.వో చల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎం.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు. కాగా, భవానీపురంలోని రేషన్ డిపోలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూడీసీ ఐ.శివ, రేషన్ డీలర్ లీలా ప్రసాద్, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలి

» మంత్రి కొల్లు రవీంద్ర



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** మసులా బీచ్ ఫెస్టివల్‌ను జాతీయస్థాయిలో నిర్వహించేందుకు అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నగర ప్రముఖులు, నిర్వహణ కమిటీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడారు. వేదిక నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, కబడ్డీ, జలక్రీడలు, బీచ్ వాలీబాల్ నిర్వహణ, ఫుడ్‌కోర్టు తదితర అంశాలపై మంత్రి చర్చించారు. జూన్ 5న 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణతో మసులా బీచ్ ఫెస్టివల్ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. 6, 7, 8 తేదీల్లో క్రీడలు, సాంస్కృతిక, వినోదంతో పాటు విజ్ఞానం అందించే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే పర్యాటకులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా వివిధ ప్రాంతాల నుంచి బస్సులు నడుపుతామన్నారు. చిలకలపూడి నుంచి బీచ్‌వరకు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వన్‌వే చేస్తామన్నారు. తిరుగు ప్రయాణం అయ్యే వారికి పోతేపల్లి, గోకవరం, పెదపట్నం తదితర గ్రామాల మీదుగా 216 జాతీయ రహదారిని చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీచ్ ఫెస్టివల్‌లో లక్షలాది పర్యాటకులు పాల్గొంటున్నందున విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ 3న కోనేరు సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 2018 ఫెస్టివల్ కంటే ఘనంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమాలకు నోడల్ అధికారిగా మెప్మా పీడీ సాయిబాబు వ్యవహరిస్తారన్నారు. పర్యాటకులు, క్రీడాకారులు, కళాకారులకు భోజన వసతి సదుపాయాలు కల్పించేందుకు హోటల్ యజమానులు, వ్యాపారస్తులు సహకరించాలన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలతో రాజకీయాలకు అతీతంగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కోర్టు, లక్ష్మీటాకీసు, కోనేరుసెంటర్, జడ్పీ సెంటర్లలో మసులా ఉత్సవాలకు చెందిన హోర్డింగ్‌లు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, ఈవెంట్ మేనేజర్ ఆనంద్, తహసీల్దార్ హరనాథ్, డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్‌మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, బి.ధన్వంతరీ ఆచార్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ మండపాల్లో 'బంగారం శ్రీను'

» నగరంలో రెండుచోట్ల లీజుల్లో భాగస్వామ్యం

» వాసవీ క్లబ్‌లో పరిచయమైన వారితో వ్యాపారం

**విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** ముచ్చెర్ల శ్రీనివాసరావు.. బంగారం చిట్టీలను నిర్వహించి వందలాది మంది నెత్తిన కుచ్చు టోపీ పెట్టిన వ్యక్తి. ప్రజల్లో ఆశలను రేకెత్తించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన అతడు చేసిన బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తనకు బంగారం, నగదు చిట్టీల వ్యాపారం తప్ప మరొకటి లేదని రెండు రోజుల క్రితం ఖాతాదారులకు వాయిస్ సందేశాన్ని పంపాడు. రెండు, మూడునెలల క్రితం శ్రీనివాసరావు కల్యాణ మండపాల నిర్వహణలోకి దిగాడు. విజయవాడ హనుమాన్‌పేటలో ఉన్న ఆలపాటి కల్యాణ మండపాన్ని, సితార సెంటర్‌లో ఉన్న ఎన్ కన్వెక్షన్ సెంటర్‌ను మరో ఇద్దరు భాగస్వాములతో కలిసి అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. వాసవి క్లబ్‌లో చురుకైన సభ్యుడిగా వ్యవహరిస్తూ అందులోని ఇతర సభ్యులను పరిచయం చేసుకున్నాడు. వారితో తాను చిట్టీల వ్యాపారం చేస్తున్నానని చెప్పి కొత్తగా మరో వ్యాపారం మొదలుపెడుతున్నానని, అందులో భాగస్వాములు కావాలని ప్రతిపాదనలు చేశాడు. అంతా వాసవీ క్లబ్‌లో సభ్యులుగా ఉండటంతో శ్రీనివాసరావు చెప్పిన మాటలు నమ్మారు. సితార సెంటర్‌లో ఉన్న ఎన్ కన్వెక్షన్ సెంటర్‌ను కృష్ణలంకకు చెందిన వాసవి క్లబ్ సభ్యుడు, అతడి వియ్యంకుడితో కలిసి లీజుకు తీసుకున్నారు. ముగ్గురు రూ.15లక్షల చొప్పున పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరి నుంచి రూ.30లక్షలు వసూలు చేసి, కన్వెక్షన్ సెంటర్‌లోకి అవసరమైన ఫర్నీచర్ తాను కొనుగోలు చేస్తానని చెప్పాడు. తీరా రికార్డుల్లో ఆ భాగస్వాములు ఇద్దరూ రూ.10లక్షలు చొప్పున ఇచ్చినట్టు రాశాడు. చిట్టీల వసూలు సొమ్మునే కల్యాణ మండపాల నిర్వహణ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టినట్టు తెలుస్తోంది. రెండు, మూడునెలల క్రితమే ఎన్ కన్వెక్షన్ సెంటర్‌ను లీజుకు తీసుకున్నట్టు తెలిసింది. దీనికి ముందు హనుమాన్‌పేటలోని ఆలపాటి రామారావు హాలును లీజుకు తీసుకున్నారు. ఇందులో రూ.5లక్షలు పెట్టుబడి పెట్టి రూ.9లక్షలు వాడుకున్నాడని భాగస్వాములు చెబుతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వారిలో వేడిని చల్లార్చడానికి వాయిస్ సందేశం పంపాడు. తనకు చిట్టీల వ్యాపారం తప్ప మరే ఇతర వ్యాపారాలు లేవని, రెండు రోజుల్లో వచ్చి డబ్బులు బకాయి ఉన్న వాళ్లందరికి సర్దుబాటు చేస్తానని చెప్పాడు. బాధితులకు భరోసా ఇచ్చేందుకు ప్రయత్నించిన ముచ్చెర్ల శ్రీనివాసరావు వాయిస్ సందేశంలో కల్యాణ మండపాల లీజుల గురించి ఎందుకు ప్రస్తావించలేదన్న ప్రశ్నఉత్పన్నమవుతోంది. శ్రీనివాసరావు సందేశంపై బాధితులు నమ్మకాన్ని వ్యక్తం చేయడంలేదు. బాధితులకు ఐపీ నోటీసులు ఇచ్చేందుకు శ్రీనివాసరావు న్యాయవాదులతో సమాలోచనలు చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. మరోపక్క పోలీసులు మాత్రం అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

## దుర్గమ్మ స్మార్త వేదపాఠశాల ప్రవేశాలు ప్రారంభం

**ఇంద్రకీలాద్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** విజయవాడ నగర శివారు పోరంకి గ్రామంలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం స్మార్తవేద పాఠశాల జూన్ 5 నుంచి పునఃప్రారంభమవుతుందని, విద్యాభ్యాసం కొరకు విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ప్రవేశ దరఖాస్తులు పొందవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ వికాసానికి తోడ్పడే వేదవిద్య అభ్యున్నతికి, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కల్పించడానికి దేవస్థానం కట్టుబడి ఉందని, వేదవిద్యార్థులకు మరింతగా ప్రోత్సాహం అందిస్తామని ఈవో పేర్కొన్నారు.



ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, కార్యదర్శులు

## మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడిగా జ్యోతి ప్రకాష్

**విజయవాడ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):** మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా జ్యోతిప్రకాష్ ఎన్నికయ్యారు. ఆదివారం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలోని అసోసియేషన్ హాలులో జరిగిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. కార్యదర్శిగా ఎం.హరిగోపాల్ ఎన్నికయ్యారు. ఎలక్షన్స్ స్టేట్ సెక్రటరీ ఎస్.రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

## అన్నసంతర్పణ సమితి వార్షికోత్సవం

**వన్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలిగా ఉన్నవారికి ఆహారం అందించటం మహత్తర కార్యక్రమమని ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ అన్నారు. అన్న సంతర్పణ సమితి నాలుగో వార్షికోత్సవ వేడుకలు వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో ట్రస్ట్ అధ్యక్షుడు, వ్యవస్థాపక కార్యదర్శి గుండు దిలీప్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. చైర్మన్ డూండీ రాకేష్, విజయవాడ నార్త్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.స్రవంతి రాయ్, హజరత్తయ్య గుప్తా, వంకదారు వాసుదేవరావు, గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ బాలికపై దాష్టీకం

(5వ పేజీ తరువాయి)

బాలికపై దాడి ఘటనను చూసిన అక్కడున్నవారు తాము తీసిన వీడియోను పైఅధికారులకు పంపారు. అధికారులు స్పందించి ఈ విషయంపై వివరాలు అందజేయాలని కోరడంతో ఐసీడీఎస్ నోడల్ అధికారి బాలసదన్‌కు వెళ్లి జరిగిన విషయంపై ఆరా తీశారు.

### ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చి హంగామా..

బాలికను కొట్టిన ఘటనపై అధికారులు ఆరా తీయడంతో బాలసదన్‌లో పనిచేసే సూపరింటెండెంట్ తన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగా ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వద్దకు వచ్చి వారితో వాగ్వివాదానికి దిగింది. వీడియోలు ఎవరు తీశారో చెప్పాలని, వాటిని తొలగించాలని, మీ ఫోన్‌లు లాక్ తీసి చూపాలని సిబ్బందిపై ఒత్తిడి తెచ్చింది. మేము వీడియోలు తీయలేదని, కార్యాలయానికి పనిపై వచ్చిన వారు వీడియోలు తీశారని సిబ్బంది చెప్పారు. అయినా వారి ఫోన్‌లను బాలసదన్‌లో పని చేసే సూపరింటెండెంట్ పరిశీలించింది. బాలసదన్, ఇక్కడున్న వన్‌స్టాప్ సెంటర్ నా పరిధిలో ఉన్నాయని, నన్ను ఎవరూ ఏం చేయలేరని, బాలసదన్ సూపరింటెండెంట్ అనడంతో చిన్నారి పెద్దగా ఏడుస్తుండటంతోనే బాలిక ఇబ్బంది ఏమిటో చూడటానికి వచ్చామని, ఇందులో తప్పేముందని, ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది ప్రశ్నించారు. అనాథ బాలిక వేసవి సెలవుల్లో ఎక్కడకు వెళుతుందని, ఇంతగా చిన్నారిని కొట్టాల్సి అవసరం ఏం వచ్చిందని, ఉన్న ఒక్క పాపపై దాడి చేస్తే ఎలాగని వారు నిలదీశారు. కాగా, నన్ను సూపరింటెండెంట్ కొట్టారని, అల్లరి చేస్తున్నానని, యోగా చేయలేదనే కారణంతో కొట్టారని చిన్నారి దుర్గ అమాయకంగా చెప్పడం గమనార్హం.

### విచారణ చేస్తున్నాం

బాలసదన్‌లో శనివారం జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఏం జరిందనే విషయం తెలుసుకునేందుకు నోడల్ అధికారిని అక్కడకు పంపాం. చిన్నారి దుర్గ కొంత అల్లరి చేస్తుంది. బాలసదన్‌లో పనిచేసే సూపరింటెండెంట్ దూకుడు స్వభావంతో వ్యవహరిస్తుంది. దీంతోనే ఈ ఘటన జరిగినట్లుగా తేలింది. తల్లిదండ్రులు లేకపోవడంతోనే పామర్తి దుర్గ బాలసదన్‌లో ఉండి పోయింది. ఉన్న ఒక్క చిన్నారిని అక్కడ పనిచేసే సూపరింటెండెంట్ జాగ్రత్తగా చూసుకోవాల్సిందే.

-రాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్

## ఇష్టానికి మాట్లాడితే చట్టపరమైన చర్యలు

» గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండిపాటు

**విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** 'గ్రామ రెవెన్యూ అధికారుల సంఘనేత భూపతిరాజూ.. నీ ఇష్టానికి నువ్వు మాట్లాడితే చట్టపరమైన చర్యలకు కూడా వెనుకాడేది లేదు. నాయకుడివైతే సభ్యుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలి కానీ, ఎవరినో సంతోష పెట్టడానికి ఇలాంటి చౌకబారు మాటలు భవిష్యత్తులో కూడా మాట్లాడొద్దు' అని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.ఆంజనేయకుమార్, అనుపమ హెచ్చరించారు. ఆదివారం వారు విజయవాడలో మీడియాతో మాట్లాడారు. విశాఖ జిల్లాలో జరిగిన మీడియా సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఓపిగ్గా సమాధానాలు చెప్పారన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రిని కలవకపోవడానికి గల కారణాలను వెల్లడించారని తెలిపారు. బొప్పరాజును నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కొంతమంది నాయకులు, ప్రభుత్వ పెద్దల దృష్టిని ఆకర్షించడానికి భూపతిరాజును అడ్డం పెట్టుకుని చౌకబారు వ్యాఖ్యలు చేయించారని ఆరోపించారు. మోసపూరిత ప్రకటనలతో గత ప్రభుత్వ హయాంలో వీఆర్వోలను మోసం చేసిన విషయం రాష్ట్రంలో ప్రతి గ్రామ రెవెన్యూ అధికారికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వం దృష్టిలో హీరో కావడానికి ఒక అసంబద్ధ జీవోతో 3795 మంది గ్రేడ్2 వీఆర్వోల జీవితాన్ని నాశనం చేసిందికాక, వీఆర్వో వ్యవస్థను అస్తవ్యస్తం చేసి, బొప్పరాజు వెంకటేశ్వర్లుపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ గుర్తింపు, సాన్నిహిత్యం పెంచుకోవాడనికి నిబద్ధత కలిగిన నాయకులపై అక్కసు వెళ్లగక్కనవసరం లేదని, బాధ్యతతో పనిచేస్తే గుర్తింపు, పేరు ప్రఖ్యాతలు అవే వస్తాయన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఉండే వ్యామోహంలో ఒక్క శాతమైనా వీఆర్వోల సమస్యలపై ఉంటే సంఘం ఇలా ఉండేది కాదన్నారు. బొప్పరాజు అహర్నిశలు శ్రమిస్తూ, వాటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తూ, చాలా సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు.

## ఇళ్లకు స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలి : సీపీఎం

**గవర్నర్‌పేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** కూటమి ప్రభుత్వం ఇళ్లకు అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఆదేశాలు ఇవ్వడం శోచనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక శ్రీశ్రీ భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ మొత్తాన్ని అదానీకి కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని, స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. సీపీడీసీఎల్ పరిధిలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని ముఖ్య నగరాల్లో మీటర్లు బిగించేందుకు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం నిలిపివేయాలని, ఇప్పటికే వ్యాపార సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, అదానీ సంస్థతో మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, సర్దుబాబు చార్జీల భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ఇంద్రకీలాద్రిపై.. మినీ ఫ్లైఓవర్!

(5వ పేజీ తరువాయి)

విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దుర్గగుడికి సంబంధించి రెండో ఘాట్ మార్గాన్ని ఇంతకు ముందు ఆయన ప్రతిపాదించారు. ఘాట్ మార్గాన్ని ఎన్‌హెచ్ - 65 నుంచి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో 10 మీటర్ల వెడల్పున ఘాట్ మార్గాన్ని అభివృద్ధి చేయాలనుకున్నారు. అక్కడ ఉన్న స్థలాభావం రీత్యా చూసినా కూడా 10 మీటర్లకు మించి లేదు. దీంతో ఇది అవసరాలకు తగినట్టుగా లేదని ఆయన భావించారు. దీంతో 16 మీటర్ల వెడల్పుతో కూడిన ఫ్లై ఓవర్ మార్గాన్ని అభివృద్ధి చేయాలని ఆయన నిర్ణయించారు. ఫ్లై ఓవర్ పొడవు ప్రస్తుతం 265 మీటర్లుగా ఉంటుంది.

### 11 ఫ్లోర్లతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

ఇంద్రకీలాద్రి దిగువున ఉన్న వాహనాల పార్కింగ్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని.. ఈ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. ఘాట్ మార్గంలో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయటం వల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి వీలుగా ఓం టర్నింగ్ మలుపు దగ్గర దానిని అనుకుని కొండ దిగువున 11 అంతస్తులతో కూడిన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌కు ప్రతిపాదించటం జరిగింది. దిగువున 38,949 చదరపు అడుగులు విస్తీర్ణంలో ఈ మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ కాంప్లెక్స్ 40 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఇది ఘాట్ రోడ్డుకు అనుసంధానమవుతుంది. నాలుగు చక్రాల వాహనాలు 800 వరకు, ద్విచక్రవాహనాలు 600కు పైగా పార్కింగ్ చేసుకునేలా మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దనున్నారు.

## బీసీ వెల్ఫేర్‌లో బదిలీలలు!

(5వ పేజీ తరువాయి)

తూర్పు వద్దంటున్నారు కాబట్టి.. వియవాడ సెంట్రల్‌కు వెళతానని ఆమె చెప్పినా వినటం లేదని తెలిసింది. విజయవాడ సెంట్రల్‌లోకి రావటానికి కూడా షాడో అంగీకరించటం లేదని సమాచారం. గుడ్లవల్లేరు ఖాళీగా ఉందనుకుంటే దానిని కూడా షాడో బ్లాక్ చేయించినట్టు తెలిసింది. గుడివాడలో కాలేజీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేసే ఒకరు ప్రీమెట్రిక్ విభాగంలో బదిలీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాస్తవానికి కాలేజీ హాస్టల్స్‌లో పనిచేసే వారిని ప్రీ మెట్రిక్ విధానంలో ఇవ్వకూడదు. కానీ ఆమెకు ప్రీ మెట్రిక్ విధానంలో పంపించటానికి చర్యలు చేపట్టారు.

### ప్రీ కౌన్సెలింగ్ పేరుతో అడ్డగోలు బదిలీలు

ప్రీ కౌన్సెలింగ్ ఎక్కడా ఉండదు. ప్రీ కౌన్సెలింగ్ పేరుతో ఉమ్మడి కృష్ణా జిల్లా అధికారులు రిక్వెస్ట్ బదిలీలు పెట్టుకున్న వారిని పదే పదే ప్రీ కౌన్సెలింగ్‌కు పిలిచి వారితో బేరసారాలు నడిపినట్టు సమాచారం. ఇలా బేరసారాలు కుదిరిన తర్వాత ఎంపిక చేసిన స్థానాలకు బదిలీలు చేస్తున్నట్లు తెలిసింది.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

## ప్రజా పంపిణీ వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేయాలి : సీపీఎం

**హనుమాన్‌జంక్షన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలనే ఉద్దేశ్యంతో రేషన్‌కు బదులు నగదు బదిలీ చేసి తద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సీపీఎం కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రేషన్ పంపిణీ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ● మొదటి రోజు తరగతులకు జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అధ్యక్షత వహించారు. వి.శ్రీనివాసరావుతో పాటు సీపీఎం రాష్ట్ర కారదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు తరగతులు నిర్వహించారు. కార్యక్రమాన్ని బేత శ్రీనివాసరావు, జే.ఏసుపాదం, అబ్దుల్‌బారీ, రాజనాల సురేష్, తాళం మధు, తోట సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

**రేషన్ దుకాణాల పునఃప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**





చెంచుల కాలనీలో రేషన్ బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ.. ప్రసాదంపాడులో..

**గన్నవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం స్థానిక చెంచుల కాలనీలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలసి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ దుకాణాల్లో సరుకులు ఇవ్వటం వల్ల లబ్ధిదారులకు మేలు జరుగుతుందన్నారు. 15వ తేదీ లోపు ఎప్పుడైనా సరుకులు తెచ్చుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్ కేవీ శివయ్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు, నాయకులు దొంతు చిన్న, దయాల రాజేశ్వరరావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, జాస్తి శ్రీధర్, యనమదల సతీష్, జనసేన నాయకుడు చిమట రవివర్మ పాల్గొన్నారు.

**ప్రసాదంపాడు :** రామవరప్పాడులోని 12వ నంబర్ చౌకధరల దుకాణం వద్ద గ్రామ టీడీపీ నాయకులు రేషన్ సరుకులు పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్, గ్రామ ఉపసర్పంచ్ అద్దేపల్లి సాంబు, నబిగాని కొండ, కళ్ళేపల్లి సాయిరామరాజు, ఇజ్జి రాము, జనసేన నాయకులు పాల్గొన్నారు.



హనుమాన్‌నగర్‌లో..

**హనుమాన్‌జంక్షన్ :** పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం రేషన్ డిపోలు పునఃప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక హనుమాన్‌నగర్‌లో రేషన్ డిపోను టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త చలమలశెట్టి రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. మరి కొన్ని దుకాణాలను కూటమి నాయకులు దాసరి బెనర్జీ, వడ్లమూడి ఆంజనేయులు ప్రారంభించారు. టీటీ అంకాలు, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో గాబ్రియేలు తదితరులు పాల్గొన్నారు.

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** పేదలకు అందాల్సిన రేషన్ సరుకులను చౌకధరల దుకాణాల డీలర్ల ద్వారా లబ్ధిదారులకు వీలైన సమయంలో సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కోవడం హర్షణీయమని ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, బేతా శేషుకుమార్, గుండపనేని ఉమా వరప్రసాద్, కట్టుబోయినవాగమణి, అక్కినేని కృష్ణాజీ, కలపాల రాధాకృష్ణమూర్తి, వేగిరెడ్డి పాపారావు తదితర నాయకులు అన్నారు. రంగన్నగూడెం, వేలేరు, మల్లవల్లి, వీరవల్లి కొత్తపల్లి, కానుమోలు, ఆరుగొలను, రేమల్లె రేషన్ పంపిణీ చేశారు.



వేలేరులో..



ఆముదాలపల్లిలో..

**ఉంగుటూరు :** నిత్యావసర సరుకుల పంపిణీ విధానంలో అక్రమాలను అరికట్టి పారదర్శకతను పెంచడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని టీడీపీ మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్రబాబు అన్నారు. రేషన్ షాపుల పునఃప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. తరిగొప్పుల రేషన్‌డిపోను రవీంద్రబాబు ప్రారంభించారు. ఆముదాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, పోతినేని రామకృష్ణ, దాసరి వెంకట బాపినీడు, పెదఅవుటపల్లిలో టీడీపీ నాయకుడు కుందేటి చంద్రశేఖర్, ఆత్కూరులో తాతినేని సృజన్‌బాబు, అట్లూరి రామ్ కిరణ్, తేలప్రోలు, మానికొండలో గులిపల్లి సందీప్, ఆరికట్ల రవికుమార్ సమక్షంలో భీమవరపు వెంకటరెడ్డి, యడ్లపల్లి సాయిబాబు ప్రారంభించారు.



ఈడుపుగల్లులో..

**కంకిపాడు :** రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లులో రేషన్‌షాపును ఆదివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ పందిపాటి ఇందిర, సుధాకర్, షేక్ షకార్ తదితరులు పాల్గొన్నారు. కంకిపాడులో రేషన్ షాపును ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకట రమణ, చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, పచ్చిపాల రాజ, శ్యామ్, బోయిన నాగరాజు, జి. శ్రీనివాసరావు, దివి రోహిణి పాల్గొన్నారు. ఉప్పలూరులో రేషన్ షాపును ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి ప్రారంభించారు. సర్పంచ్ లాం సోనియా, చలసాని రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. మద్దూరులో రేషన్ షాపును మాజీ జెడ్పీసీ సభ్యులు గొంది శివరామకృష్ణ ప్రారంభించారు.



కాటూరులో..

**ఉయ్యూరు :** కాటూరులో రేషన్ పంపిణీని తహసీల్దార్ సురేశ్‌కుమార్, టీడీపీ నాయకులు యెనిగళ్ల కుటుంబరావు, సూరపనేని ప్రసాద్, వేమూరు శ్రీనివాసరావు, కొండా ప్రవీణ్ ప్రారంభించారు. ఉయ్యూరులో చైర్మన్ వి.సత్యనారాయణ, వార్డుల్లో కౌన్సిలర్లు.. ముదునూరులో సర్పంచ్ నాగలక్ష్మి, పార్టీ నాయకులు నాగరాజు, పాలడుగు మాధవీలత, భాస్కర్, బోళ్లపాడులో మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి సరుకుల పంపిణీ ప్రారంభించారు. ఉయ్యూరు 20వ వార్డులో చిరంజీవి 16వ వార్డులో జంపాన పూర్ణచంద్రరావు, ఇతర వార్డులో కూనపరెడ్డి వాసు, 12వ వార్డులో బూరెల రమణ, 13వ వార్డులో ఫైలా శ్రీనివాసరావు ప్రారంభించారు.



కానూరులో..

**పెనమలూరు :** చౌక డిపోల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు అన్నారు. ఆదివారం తాడిగడప మునిసిపాలిటీ కానూరులో వివిధ డివిజన్లలో జరిగిన రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాం లో రేషన్ సరుకులు ఇంటింటికీ పంపిణీ పేరు చెప్పి దోపిడీ చేసి బియ్యాన్ని కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి కోట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్, మాధవ్, రామకృష్ణ, కోసూరి రమేష్, రవీ, శ్రీను, పెద్ద రవీ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపై విమర్శలు సిగ్గుచేటు

**కంకిపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్యప్రచారం సిగ్గుచేటు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. రేషన్ పంపిణీలో వందల కోట్లు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. 151 సీట్లు నుంచి 11 సీట్లు పడిపోయినా సిగ్గు రాలేదన్నారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీపై మరోమారు వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## బొమ్ములూరులో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నేడు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** రైతు సంక్షేమశాఖ ద్వారా నిర్వహించే వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బొమ్ములూరులో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏవో భవాని ఆదివారం తెలిపారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో ముందుగా చేయవలసిన మట్టి నమూనా పరీక్షలు, నేలఆరోగ్యానికి అనుగుణంగా పోషక యాజమాన్యం, యాంత్రీకరణ, డ్రోన్స్ వినియోగం తదితర విషయాలపై శాస్త్రవేత్తల బృందం రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. బొమ్ములూరులోని రైతు సేవా కేంద్రం దగ్గర జరిగే కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని ఆమె కోరారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** అంపాపురంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ జి.బి. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని గమనించి సహకరించాలని వినియోగదారులను కోరారు.

**ఉంగుటూరు :** 33/11కేవీ ఉంగుటూరు, తేలప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేయనున్నారు. ఈ నేపథ్యంలో మానికొండ, పొట్టిపాడు, నారయ్య అప్పారావుపేట, ఆనందపురం, బండారుగూడెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల (ఐదుగంటలపాటు)వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



## ముక్తేశ్వరుడికి లక్ష పుష్పార్చన

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** పెరికీడు ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో 21వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సీతారామయ్య, శ్యామ్, మహేష్‌ల ఆధ్వర్యంలో ముక్తేశ్వరునికి లక్షపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నండూరి సత్యవేంకటేశ్వరశర్మ, నక్కా బాబు, పుట్టి వీర్రాజు, కోటేశ్వరరావు, నాగరాజు, వేణు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో జన్మదిన కేక్ కట్ చేస్తున్న అనుమోలు

## ఘనంగా టీడీపీ నేత అనుమోలు జన్మదినం

**పెనమలూరు, జూన్1 (ఆంధ్రజ్యోతి) :** టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనుమోలు నివాసం వద్ద, పోరంకి టీడీపీ కార్యాలయంలో అభిమానుల మధ్య ఆయన జన్మదిన కేకులను కోసి పంచిపెట్టారు. పోరంకి అనుమోలు ఇంటి వద్ద వంద మంది మునిసిపల్ కార్మికులకు చీరెలు, కూరగాయలు పంచిపెట్టారు. పోరంకి బీజేఆర్ నగర్ చర్చిలో నాలుగు వందల మంది పేదలకు బ్రెడ్లు, పండ్లు తదితర వస్తువులను పంచిపెట్టారు. జన్మదిన వేడుకల్లో పెనమలూరు టీడీపీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, చిన్నారి, అనంతనేని ఆజాద్, ముసునూరు శ్రీనివాసరావు, తుమ్మల రామ్‌కుమార్, దోనేపూడి రవికిరణ్, మల్లంపాటి విజయలక్ష్మి, పండుల రజిని, యాళ్ల చక్రవర్తి, షేక్ బుజ్జి, టీడీపీ రెహమాన్, చెన్నుపాటి శ్రీనివాసరావు, బొంగరాల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి ఫిట్నెస్ మంత్ర యోగాతో ఆరోగ్యం

**పెనమలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** ఆరోగ్యానికి, శాంతికి భారతదేశపు యోగులు లక్షలాది మంది మోడల్స్‌గా ఉన్నారని అలాంటి వారిగా తయారవ్వడానికి ప్రధానమంత్రి ఫిట్నెస్ మంత్ర ఉపయోగపడుతుందని యోగశక్తి సాధన సమితి అధ్యక్షులు డాక్టర్ మాకాల సత్యనారాయణ, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబులు అన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని యోగశక్తి సాధన సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ యోగాడే 2025 కార్యక్రమంలో భాగంగా 21రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో యోగశక్తి సాధన సమితి కేంద్ర కార్యాలయం వద్ద ముందుగా వెలగపూడి శంకరబాబు జ్యోతి ప్రజ్వలన చేసి అందరికీ మోడీ హెల్త్ కేర్ స్టిక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కానూరు విజయలక్ష్మి, బూతపాటి ఉదయ్‌కుమార్, సయ్యద్, విఠల్, కొండవీటి సుమతి తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయులుకు ఎన్టీఆర్ సేవా పురస్కారం



**ఉయ్యూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** ఆర్యవైశ్య ప్రముఖుడు వెంట్రప్రగడ వీరాంజనేయులుకు ఎన్టీఆర్ సేవా పురస్కారం లభించింది. ఎన్టీఆర్ 102వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం రాత్రి ఎక్సరే సంస ఆధ్వర్యంలో విజయవాడ పీబీ సిద్ధార్థ అకాడమీలో జరిగిన ఎన్టీఆర్ సేవా పుర స్కార్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కొల్లూరి, నూకల సాంబశివరావు, సినీ హీరో రాజేంద్రప్రసాద్ నుంచి అవార్డు అందుకున్నారు. వీరాంజనేయులుకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ఆర్యవైశ్య ప్రముఖులు నేరెళ్ల వేణు, శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## కంటి క్యాన్సర్‌పై అవగాహన రన్



**పెనమలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ రెటినో బ్లాస్టమా అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకొని తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించే వైటథాన్ రన్‌ను ఆదివారం నిర్వహించారు. ఉదయం ఆరుగంటలకు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు పరుచూరి వైటథాన్ పరుగును జెండా ఊపి ప్రారంభించారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

**హనుమాన్‌జంక్షన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):** బొమ్ములూరు (కలపర్రు)టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. జంక్షన్ ఎస్సై వి. సురేశ్ తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం తెల్లవారు జామున విజయవాడ నుంచి వైజాగ్ వెళుతున్న లారీ బొమ్ములూరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద రోడ్డు మార్జిన్‌లో ని లబెట్టి ఉన్న మరో లారీని వెనుక నుంచి ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమా దంలో ఢీ కొట్టిన లారీ డ్రైవరు కోనసీమ జిల్లా రాయవరం మండలం, మాసవరం గ్రామానికి చెందిన మేడికొండ సత్యనారాయణరెడ్డి (45)మృతి చెందాడు. తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లారీని తప్పించబోయి యువకుడి..

**ఉంగుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** బైక్‌పై వెళ్తున్న యువకుడు ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి మరో లారీని ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన తేలప్రోలు ఉషారామా కళాశాల ఎదురుగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన చొప్పాల దిలీప్‌చంద్ర (30) విజయవాడలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తనబైక్‌పై ఏలూరు నుంచి బయలుదేరి విజయవాడ వైపు వస్తున్నాడు. తేలప్రోలు ఉషారామా కళాశాల సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో దానిముందు వెళ్తున్న మరో లారీకి తగలడంతో అదుపుతప్పి బైక్‌తో సహా రోడ్డుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి చొప్పా బాబూజీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.



కొబ్బరికాయ కొట్టి పూడికతీత పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

## కాలువ చివరి భూములకు నీరందాలి

**ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :** నియోజకవర్గంలోని పంటపొలాలకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం బుద్దవరంలో నీటిసంఘం నిధులతో పది కిలోమీటర్ల పొడ వునా కాలువ పూడికతీత పనులు మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలువ చివరి భూములకు సంవృద్ధిగా సాగునీటిని అందించాలన్నారు. ఎనిమిదేళ్లుగా కాలువ పూడికతీతకు నోచుకోకపోవంతో ఉంగుటూరు మేజర్‌లో పూడిక పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కొసరాజు రాము, వైస్ చైర్మన్ జాస్తి విజయభూషణ్ కుమార్, దాసరి శ్రీకృష్ణ, టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, గొంది నరేంద్ర, మేడేపల్లి రమ, బోడపల్లి రాంబాబు, గొంది శివ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ కేసులపై బహిరంగ చర్చకు సిద్ధం

**గన్నవరం :** తాను ఎమ్మెల్యే అయిన తరువాత సంవత్సర కాలంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఆదివారం స్థానిక చెంచుల కాలనీలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలసి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సంవత్సరానికి ఎన్ని కేసులు పెట్టారో తాము అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో ఎన్ని కేసులు నమోదయ్యాయో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణ చేసుకుని నిజాలు వెలికితీయాలన్నారు.

**బ్రాయిలర్ ధరలు**
అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

## త్రుటిలో తప్పిన ప్రమాదం

గుడివాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానిక బంటుమిల్లి రోడ్డులో చేపల మార్కెట్ సెంటర్‌లో గుడివాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 21జడ్ 0345 బస్సు బ్రేక్ ఫెయిల్, గేర్ బాక్స్ విఫలమవ్వడంతో అదుపు తప్పింది. ఈ క్రమంలో డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించి పక్కను ఉన్న కంకర రాళ్ల గుట్ట మీదకు వెళ్లడంతో బస్సు నిలిచింది. దీంతో చేపలవ్యాపారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు డ్రైవర్‌ను అభినందించారు.



కంకరగుట్టను ఢీకొట్టి నిలిచిన ఆర్టీసీ బస్సు

# ఇచ్చిన హామీలను నెరవేరుస్తా

● వాడవాడలా రేషన్ దుకాణాల ప్రారంభం ● వినియోదారులకు రేషన్ సరుకుల పంపిణీ చేసిన అధికారులు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్ని అవాంతరాలు ఎదురైన ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభు త్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం పట్టణంలోని 15వ వార్డు గుడ్‌మెన్‌పేటలో 5వ నెంబరు, బిళ్లపాడులోని 26వ నెంబరు దుకాణాల్లో నిత్యావనర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రారంభించారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఆర్‌ఐ నాగబాబు, రాంబాబు పాల్గొన్నారు.

**గుడివాడ రూరల్ :** బొమ్ములూరులోని రేషన్ షాపులను ఆదివారం మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీ, టీడీపీ నాయకులతో కలసి ప్రారంభించారు. దొండపాడులో వలివర్తిపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడు లింగమనేని వీర బసవయ్య, సెరిగొల్వేపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు నూతక్కి కుటుంబరావుల ఆధ్వర్యంలో రేషన్ షాపును ప్రారంభించారు. లింగవరంలో టీడీపీ నాయకులు జాన్ శ్యామ్యూల్ తదితరుల ఆధ్వర్యంలో రేషన్ షాపులు ప్రారంభించారు. కటారి శ్రీనివాస్, గుడివాడ శ్రీను రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.



పెదముత్తేవిలో నిత్యావసరాలు అందిస్తున్న మస్తాన్

**కూచిపూడి :** పెదముత్తేవిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు ఆదివారం పునఃప్రారంభించిన దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు అందించారు. సర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.

**నందివాడ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ షాపుల వద్ద రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాలు రెవెన్యూ శాఖ అధికారులు , సర్పంచ్‌లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందివాడ 9న నెంబరు షాపులో నందివాడ మండల తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు నంబూరి రాకేష్, సర్పంచ్ రత్నకుమారి, పొలుకొండ సర్పంచ్ ఝాన్సీ కుమారి, రేషన్ పంపిణీలో పాల్గొన్నారు.

**పామర్రు :** పామర్రులోని 8నెంబరు రేషన్ దుకాణంలో ప్రభుత్వ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ముఖ్యఅతిథిగా విచ్చేసి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలసి పునఃప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జిరవికాంత్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు, రేషన్ డీలర్ యడ్ల అప్పారావు, మంతెన రామంజనేయులు పాల్గొన్నారు.

**పమిడిముక్కల :** వీరంకి లాకువద్ద రేషన్ షాపును సర్పంచ్ ముళ్లపూడి సునీత, డీసీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉపసర్పంచ్ వెంక టేశ్వరరావు, వార్డుసభ్యుడు తాతారావు, గోపాలకృష్ణ ప్రారంభించి సరుకులు కార్డుదారులకు పంపిణీ చేశారు. అలీనఖీ పాలెంలో సర్పంచ్ జైనబ్ సుల్తానా సరుకుల పంపిణీ ప్రారంభించారు. మామిళ్లపల్లిలో టీడీపీ నాయకుడు చిగురుపాటి కృష్ణారావు, గోపాలకృష్ణ, , బొబ్బాశివ, మాజీ సర్పంచ్ పాండు ప్రారంభించారు.

**పెదపారుపూడి :** జమిదింటకుర్రులో ఆదివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రేషన్ షాపును ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, తహసీల్దార్ వై.రంగారావు, పాల్గొన్నారు.



పామర్రులో రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

**గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరులో ఇందిరాకాలనీ లో రేషన్ దుకాణాన్ని మాజీ ఎంపీపీ, టీడీపీ జిల్లాపార్టీ మాజీ ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు ప్రారంభించి కార్డుదాలకు రేషన్ పంపిణీ చేశారు.వార్పురోడ్డులోని దుకాణాన్ని గ్రామ టీడీపీ అధ్యక్షుడు రంగారావు ప్రారంభించారు. విన్నకోట పీఏసీఎస్ ద్వారా నిర్వహించే రేషన్‌దుకాణాన్ని కూటమి నాయకులు పేర్ని జగన్, బెజవాడ కిషోర్,కోటప్రోలు ఆదినారాయణ, పేర్ని మురళి, గాలంకి నాగేంద్రం, సొసైటి సీఈవో పుల్లేటి నాగమల్లేశ్వరరావులు ప్రాంభించారు.

**తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు సినిమాహాలు రోడ్డులోని రేషన్ దుకాణాన్ని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆదివారం పునఃప్రారంభించి బియ్యం పంపిణీ చేశారు. 15వ తేదీ వరకు రేషన్ దుకాణానికి వచ్చి సరుకులు తీసుకుని వెళ్లే వెసులుబాటుని కల్పించారన్నారు.



తోట్లవల్లూరులో బియ్యం పంపిణీ చేస్తున్న గురుమూర్తి



మొవ్వ జడ్పీ పాఠశాల హెచ్‌ఎంకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

## బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు

కూచిపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మొవ్వ మండవ కనకయ్య జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎంగా నిమ్మగడ్డ ఉమాశ్రీ బాధ్యతలు చేపట్టారు. పలువురు ఉపాధ్యాయులతోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. నిడుమోలు జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా కాసాని అరుణ, కూచిపూడి జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, పెడసనగల్లు పాఠశాల హెచ్‌ఎంగా వెంకట సంజీవరావు, కోసూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వి.సమాధానరావులు ఆదివారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలుగా బాధ్యతలు స్వీకరించారు.

## గరికపర్రు హైస్కూల్ హెచ్‌ఎంగా శ్రీకృష్ణ

తోట్లవల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా అడిదం శ్రీకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీయూపీ పాఠశాల ఈ విద్యా సంవత్సరం నుంచి జడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావటంతో కైకలూరులో ఓరియంటల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీకృష్ణను గరికపర్రుకు బదిలీ చేశారు. దీంతో హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నానని ఆయన తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావటంతో పరిసర గ్రామాల విద్యార్థులు హైస్కూల్ చదువుకి పెనమకూరు, ఉయ్యూరు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన తెలిపారు.



శ్రీకృష్ణ

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెదపారుపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారమే ధ్యేయంగా తాను జమిదింటకుర్రులో పల్లె నిద్ర చేసినట్టు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. ఆదివారం ప్రగతి పథం - పామర్రు అనే కార్యక్రమంలో భాగంగా జమిదింటకుర్రు గ్రామంలో ప్రజల నుంచి జమ్మి చెట్టు వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో శ్మశాన వాటిక, రోడ్లు, ఇళ్ల స్థలాలు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వచ్చాయి. ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి , తహసీల్దార్ వై.రంగారావు, కార్యదర్శి కృష్ణవేణి, విశ్వేశ్వరరావు, జాస్తి రామచంద్రరావు, సుబ్బయ్య, కిశోర్, బుడ్డాలు, పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

## టీడీపీ సీనియర్ నేత మృతి

గుడ్లవల్లేరు : కూరాడ టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల శివశంకర్ (శివయ్య)(68) ఆదివారం మృతి చెందారు. అకస్మాత్తుగా గుండెపోటు రాగా ఆయన ఇంటిలోనే తుదిశ్వాశ విడిచారు. టీడీపీ మంచి నాయకుడ్ని కోల్పోయిందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, జిల్లాపరిషత్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ శాయిన పుష్పవతి అన్నారు. ఆదివారం సాయంత్రం టీడీపీ నాయకులు,కార్యకర్తలు లాక్‌డౌన్‌లోని శివయ్య స్వగృహంలో ఉంచిన ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, నీటిసంఘం అధ్యక్షలు శాయిన ప్రసాద్, బొర్రానాగేశ్వరరావు, పోలవరపు వెంకటరావు, వల్లభనేని కృష్ణప్రసాద్, గుడ్లవల్లేరు పార్టీ అధ్యక్షలు వల్లభనేని రంగబాబు, కూరాడ మాజీ సర్పంచ్ శాఖమూరి దుర్గాప్రసాద్, ఎ.రామ్మోహనరావు, జనసేన నాయకులు వెంకటేష్, సాయి తదితరులు ఉన్నారు. సోమవారం ఉదయం అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# వైభవంగా గంగానమ్మ జాతర

పామర్రు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాపర్లలో వేంచేసి ఉన్న గ్రామదేవత గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారి కథను పంబల పూజారి ఎస్. అఖిల్ గ్రామస్థులకు వివరించారు. అనంతరం 101 బిందెలతో దేవతమూర్తికి స్నానాలు చేయించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. డప్పువాయిద్యాలు, మేళతాళాలతో అమ్మవారి ఘటం, పోతురాజు గెడలు బయలుదేరి గ్రామంలో ఇంటింటా సంచరించి పూర్వపు గ్రామ కరణం వంశీస్తులైన గుండబత్తులవారి ఇంటినుంచి తొలినైవేద్యాలను స్వీకరించారు. అనంతరం అమ్మవారి పోతురాజు గెడలకు ప్రతి ఇంటా మొక్కుబడులు సమర్పించుకున్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పుప్పాల నాని, తుంగల సతీష్, కాకర్ల శ్రీహరి గ్రామ సర్పంచ్ కాకర్ల రవి, నాగమణి తదితరులు పర్యవేక్షించారు. జాతరను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# విద్యుత్ స్తంభాలపై తీగల చోరీ

తోట్లవల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : బొడ్డపాడు, చినపులిపాక గ్రామాలకు 24 గంటల కరెంట్ అందించేందుకు రూ. 70 లక్షలతో నిర్మిస్తున్న కొత్త విద్యుత్ లైన్ స్తంభాలపై తీగలను రెండ్రోజుల క్రితం దొంగలు కట్ చేసుకుపోయారు. వల్లూరుపాలెం నుంచి స్తభాలు వేసి తీగలను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల్లో అధికారికంగా ఈ కొత్త లైన్‌ను ప్రారంభించాల్సి ఉండగా దొంగలు స్తంభాలపై తీగలను కట్ చేసుకుపోవటంతో కాంట్రాక్టరు, విద్యుత్ అధికారులు ఖంగుతిన్నారు. కొద్ది రోజుల క్రితం కళ్లంవారిపాలేనికి నిర్మించిన కొత్త విద్యుత్ లైన్‌పై స్తంభాలపై రూ. 4 లక్షల విలువైన తీగలను కట్ చేసుకుపోయారు. మండల విద్యుత్ ఏఈ దేవదాసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా దొంగల జాడ తెలియ లేదు. ఇంతలోనే బొడ్డపాడు లైన్‌ను కూడా కత్తిరించుకుపోవటం గమనార్హం.



స్తంభాలపై కట్ చేసిన విద్యుత్ తీగలు

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

తోట్లవల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : యాకమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మండల విద్యుత్ ఏఈ దేవదాసు ఆదివారం తెలిపారు.

## భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుడివాడ : స్థానిక పిన్నమనేనినగర్‌లో వేంచేసియున్న భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పార్టీ పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేన నేతలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.

## ఉచిత వైద్య శిబిరం

గుడివాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ త్రిపురనేని లక్ష్మీపెరుమాళ్లు, ప్రభావతి, చలసాని రాయన్ చౌదరిల జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆస్పత్రుల వైద్యుల పర్యవేక్షణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు మౌనిక, ఎస్.తేజస్విని, అఖిల్‌వర్ధన్, రత్నదీపక్‌లు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు టి.ఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, యమ్.రమణమూర్తి, ఎలక్ట్ ప్రెసిడెంట్ వై.నాగేశ్వరరావు, వైద్య కళాశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ స్వామి, ఫార్మశీ అసిస్టెంట్ రాధిక, పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా

గుడివాడ : గ్రామంలో ఘర్షణ, ఇతర ఇబ్బందికర పరిస్థితులుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గుడివాడ రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు తెలిపారు. మల్లాయిపాలెం గ్రామపంచాయితీ కార్యాలయంలో ముస్లిం నాయకులు, యువతతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధ చేయవద్దని, ఎవరైన గోవధకు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంటుందని సీఐ సోమేశ్వరరావు హెచ్చరించారు. టీడీపీ నాయకులు ఇషాక్, రషీద్ బేగ్, జబీఖాన్ పాల్గొన్నారు.

## తపస్వి సేవలు అభినందనీయం

పమిడిముక్కల : సమాజ సేవతో పాటు, విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్న తపస్వి ఫౌండేషన్ సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. కృష్ణా పురంలో తపస్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2024- 2025 సంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థులకు ఆదివారం ప్రోత్సాహక నగదు బహుమతులు కుమార్ రాజా అందజేశారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేశ్ పాల్గొన్నారు.

## కాజ వాసికి హైదరాబాద్‌లో పెన్షన్

కూచిపూడి: కాజ గ్రామానికి చెందిన దివ్యాంగుడైన యార్లగడ్డ లక్ష్మయ్య హైదరాబాద్‌లో వైద్యసేవలు పొందుతుండగా, అతనికి నెలకు రూ.6 వేలు చొప్పున రెండు నెలలకు గానూ రూ.12 వేలను కాజ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ టి.సురేష్ హైదరాబాద్ వెళ్లి పెన్షన్ అందజేశారు. అలాగే అతని భార్య కనకదుర్గకు వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు చొప్పున రూ.8 వేలు అందించారు. ఎండీవో జె.విమాదేవి, కార్యదర్శి ఎం.ఎస్.ఎన్. మూర్తి హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందించిన సురేష్‌కు అభినందనలు తెలిపారు.

# రైల్వేగేట్ల సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు

గుడివాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి తప్పా ఆడంబరాలకు ఎరుగని గొప్ప వ్యక్తి మచిలీపట్నం పార్లమెంట్ నభ్యులు వల్లభనేని బాలశౌరి అని జనసేన నాయకులు కొనియాడారు. గుడివాడలో రైల్వే గేట్‌ల వద్ద సమస్యల పరిష్కారానికి బాలశౌరి కృషితో రూ.400కోట్లు నిధులు మంజూరైన సందర్భంగా ఆదివారం స్థానిక బేతవోలు రైల్వేగేటు వద్ద ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎంపీ బాలశౌరిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రూ.325కోట్ల వ్యయంతో గుడివాడలోని భీమవరం, పామర్రు రైల్వేగేట్‌ల వద్ద బాలశౌరి కృషితో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న రైల్వే గేట్ల సమస్యల పరిష్కారానికి రూ.400కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. సీఎస్ఆర్ నిధులతో గుడివాడలో కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, బోయిన చంటి, మణికుమార్, నాంచారయ్య, రామకృష్ణ, కృష్ణంరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పవన్, బాలశౌరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న జనసేన నాయకులు

# బీసీ చైతన్య వేదిక జాతీయ అధికార ప్రతినిధి ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

తోట్లవల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రొయ్యూరుకి చెందిన బీసీ నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు బీసీ చైతన్య వేదిక జాతీయ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన బీసీ చైతన్య వేదిక రాష్ట్ర స్థాయి సమావేశంలో జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తనకు నియామక పత్రం అందించారని వెంకట శ్రీనివాసరావు తెలిపారు. గతంలో బీసీ జగగణన సాధన సమితి అధ్యక్షుడిగా, రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ అధికార ప్రతినిధిగా, సర్దార్ గౌతు లచ్చన్న సేవా సమితి అధ్యక్షుడిగాను లుక్కా వెంకట శ్రీనివాసరావు పనిచేశారు. తన సేవలను గుర్తించి బీసీ చైతన్య వేదిక అధికార ప్రతినిధిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, బీసీల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని లుక్కా తెలిపారు.

# గ్రంథాలయాలు సృజనాత్మకతకు దోహదం

పామర్రు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో విద్యార్థులకు అందిస్తున్న వేసవి శిక్షణా తరగతులు చిన్నారుల్లో సృజన్మాతకతను పెంపొందించుకునేందుకు ఎంతోగానో దోహద పడతాయని జమీగోల్వేపల్లి గ్రంథాలయాధికారి వి. సురేష్‌కుమార్ అన్నారు. గ్రం థాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వివిధ అంశాలతోపాటుగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పి. పద్మావతి, విశ్రాంత ఉద్యోగి కృష్ణమోహన్, యోగా గురువు పి.వెంకట ధర్మారావు , విద్యార్థులు పాల్గొన్నారు.

**గుడివాడ రూరల్ :** చౌటపల్లిలో వేసవి విజ్ఞాన శిబిరం పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులు చెస్ ఆడారు. గణితంపై క్వశ్చన్లు వేసుకున్నారు. చౌటపల్లి గ్రంథాలయ అధికారి జి.రత్నచంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు, వివిధ రకాల పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు చౌటపల్లి గ్రంథాలయ అధికారి అభినందనలు తెలిపారు.



ఆటబొమ్మల వస్తువుల తయారీ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

## ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

గుడ్లవల్లేరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : షిర్డీ సాయిబాబా వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆనందంగా సుభిక్షంగా ఉండాలని, ప్రతీ ఒక్కరూ ఆ. ధ్యాత్మిక చింతన కల్గిఉండాలని గుడివాడ ఎమ్మె ల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం వడ్లమన్నాడు గ్రామం కొడిపాలెంలోని షిర్డీసాయిబాబా వారి 11వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన ఆయన ప్రారంభించారు. జగన్మోహనరావు, వడ్లమన్నాడు టీడీపీ అధ్యక్షుడు సత్తిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారి పాల్గొన్నారు.

## వీల్‌చైర్ వితరణ

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం 25000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయానికి వచ్చే వికలాంగ భక్తులు,వృద్ధుల సహాయార్థం గుడ్లవల్లేరుకు చెందిన భక్తులు డాక్టర్ బక్కు లక్ష్మీనాగేంద్రరావు ఆలయానికి ఉచితంగా వీల్‌చైర్‌ను అందజేశారని ఆయన తెలిపారు. దాతలను కొండలరావు సత్కరించారు.

## ఘనంగా కృష్ణ జయంతి వేడుకలు

గుడివాడ : స్థానిక ప్రజావేదికలో సూపర్ స్టార్ కృష్ణ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివాజీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణలు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సునీల్, కృష్ణ అభిమాన సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, రాంబాబు, రమణ, చింతపల్లి కృష్ణ, మెరుగుమాల విను పాల్గొన్నారు.

## సయ్యద్‌కు బీసీ నేతల పరామర్శ

గుడివాడ : ఇటీవల గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన రాష్ట్రసంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్‌ను ఆదివారం స్థానిక సయ్యద్ స్వగృహంలో రాష్ట్ర చైతన్య బీసీ సంఘ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేమూరి బేబి రాణి మాట్లాడుతూ సయ్యద్‌పై దాడిచేసిన వారిని గుర్తించి పోలీసు శాఖ తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు నైనవరపు శేషుబాబు, శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, మాల్యాద్రి పాల్గొన్నారు.





**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

## మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దు: ఆర్డీవో స్వాతి



మచిలీపట్నం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని ఆర్డీవో కే స్వాతి, డీఎస్పీ సీహెచ్ రాజా పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం - అక్రమ రవాణా అరికట్టాలంటూ ఆదివారం జిల్లా పరిషత్ సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమం, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆర్డీవో మాట్లాడారు. డీఎస్పీ సీహెచ్ రాజా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు కామరాజు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఝాన్సీ, సీఐ నబీ, యోగా గురువులు గురునాథ బాబు, చింతయ్య, వై జగన్‌మోహనరావు, పినిశెట్టి వేణుగోపాల్, ఆర్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

# రేషన్ కోసం పడిగాపులు ఇక ఉండవు

• ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ • ప్రజాభిప్రాయ సేకరణ తరువాతే నిర్ణయం: ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ • వాడవాడలా రేషన్ షాపులు ప్రారంభం



రేషన్ సరుకులను కార్డుదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల కోసం వీధుల్లో లబ్ధిదారుల పడిగాపులు ఇక ఉండవని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డలో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రేషన్ డీలర్లు పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన రేషన్ సరఫరా చేశారు. ఒక వృద్ధురాలికి ఇంటి వద్ద రేషన్ అందజేశారు. తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు యాసం చిట్టిబాబు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, పరుచూరి దుర్గా ప్రసాద్, విశ్వనాథపల్లి పాప, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నేతలు, అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

**అశ్వారావుపాలెంలో..**

అవనిగడ్డ రూరల్: మండల పరిధిలోని అశ్వారావుపాలెంలో చౌకధరల దుకాణాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు, దివి మార్కెట్ యార్డు ఛైర్మన్ కొల్లూరి, టీడీపీ మండలాధ్యక్షుడు చిట్టిబాబు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షుడు దాసినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ కటికల వసంత్ కుమార్, నేతలు పాల్గొన్నారు.

**ఘంటసాల మండలంలో..**

ఘంటసాల: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం ఘంటసాల మండలంలోని రేషన్ షాపులను ప్రారంభించారు. కొడాలిలోని రేషన్ షాపును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించి కార్డుదారులకు సరుకులు అందించారు. ఘంటసాలలో శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ అయినపూడి భానుప్రకాష్ రేషన్ షాపులను ప్రారంభించగా, తెలుగురావుపాలెంలో టీడీపీ మండలాధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబుతో కలిసి షాపులు ప్రారంభించారు. గ్రామాల్లోని రేషన్ షాపులను ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులతో కలిసి ప్రారంభించారు.



పెడనలో నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

**పెడనలో..**

పెడన: ప్రజాభిప్రాయం సేకరించిన తరువాతే కూటమి ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను పంపిణీ చేసే విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డులోని డీలర్ ఇమ్మడి పద్మావతికి చెందిన 7వ నెంబర్ రేషన్‌షాపులో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలిసి కృష్ణప్రసాద్ నిత్యావసర వస్తువుల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె. అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణప్రసాద్ ప్రసంగించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డుల మంజూరు నిబంధనలు సడలించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే రేషన్‌షాపునకు వెళ్లలేని స్థితిలో ఉన్న వృద్ధుల ఇళ్లకు వెళ్లి స్వయంగా నిత్యావసర సరుకులు అందజేశారు. కమిషనర్ ఎం గోపాలరావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్ మట్టా శివపావని, మాజీ కౌన్సిలర్లు ఇమ్మడి నాగపోతరావు, బూసం ఆనందరావు, ఆర్ఐ విజయలక్ష్మి, టీడీపీ నేతలు కమ్మగంటి బాబు, శీరం ప్రసాద్, రేషన్ షాపుల డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

**నాగాయలంకలో..**

నాగాయలంక: సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ కోసమే ప్రభుత్వం రేషన్ షాపులను పునఃప్రారంభించిందని టీడీపీ పార్టీ గ్రామాధ్యక్షులు ఉప్పల ప్రసాద్ తెలిపారు. ఆదివారం నాగాయలంక బస్టాండ్ సమీపంలో 6వ రేషన్ షాపును రెవెన్యూ అధికారి సనకా జనార్ధనరావు, వీఆర్వో లింగేశ్వరరావులతో కలిసి ప్రారంభించి వినియోగదారులకు నిత్యావసర వస్తువులు అందజేశారు.

**కోడూరు మండలంలో..**

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కోడూరు మండలంలో రేషన్ షాపు వద్ద నిత్యావసర సరుకుల పంపిణీని రెవెన్యూ అధికారులు పునఃప్రారంభించారు. ఆదివారం కోడూరు 5వ వార్డులోని (కొండవీటి సురేష్) రేషన్ డిపోను పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీను నాయక్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించి లబ్దిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, బడే వీరబాబు, బచ్చు వెంకటేష్; బడే గాంధీ, కాగిత రామారావు, పూతబోయిన సాయిబాబు, కోట రాంబాబు, లంకే భాస్కరరావు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

**మోపిదేవి, వెంకటాపురం గ్రామాల్లో**

మోపిదేవి: సమాజంలోని బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కిలో రూ.2ల బియ్యం పథకాన్ని ఆచరణలోకి తీసుకొచ్చిన చరిత్ర టీడీపీదేనని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీని మోపిదేవి, వెంకటాపురం గ్రామాల్లో ఎంపీపీ ప్రారంభించారు. మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీ రాణి, పార్టీ నేతలు గౌరిపర్తి వేణుగోపాల కృష్ణ, రావి వసంతరావు, అబ్బూరి జ్ఞాన సుందరరావు, కొక్కిలిగడ్డ నాగరాజు, నలుకుర్తి కృష్ణ ఉన్నారు. మండలంలోని పెదప్రోలులో సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు.

**గూడూరు, రామరాజుపాలెంలో..**

గూడూరు: మండలంలోని గూడూరు, రామరామజుపాలెం గ్రామాల్లోని రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం డీసీ ఛైర్మన్ పోతన స్వామి, తహసీల్దార్ డీ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. కూటమి నేతలు గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, ఓలేటి శ్రీను, గంజాల కృష్ణమోహన్, బాసంశెట్టి విజయ్, రాసంశెట్టి దుర్గారావు, బచ్చుల రామాంజనేయులు, బేతాళ స్వామి, ఆర్ఐ ఝాన్సీ పాల్గొన్నారు.



చల్లపల్లిలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ నాని, వైస్ ఎంపీపీ రాంబాబు

**చల్లపల్లి మండలంలో...**

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లో రేషన్ దుకాణాలు పునఃప్రారంభమయ్యాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నేతలు రేషన్ దుకాణాలను ప్రారంభించి కార్డుదారులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. టీడీపీ చల్లపల్లి మండలాధ్యక్షుడు మోర్ల రాంబాబు, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరు కోటేశ్వరరావు, డొక్కు నాగేశ్వరరావు, వైస్ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, మట్టా కోమలి, మోపిదేవి ద్వారకానాథ్, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, మెండు కొండలు, పరిశె మౌళి, గొరిపర్తి సుబ్బారావు, మేకా వెంకటేశ్వరరావు, జనసేన బొందలపాటి వీరబాబు, చోడగం విమల్‌కృష్ణ పాల్గొన్నారు.



అర్తమూరులో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీసీ ఛైర్మన్ కాశీ

**బంటుమిల్లిలో..**

బంటుమిల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ బియ్యాన్ని జూన్ 1 నుంచి రేషన్ షాపుల్లో పంపిణీ చేశారు. ఆదివారం పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు డీసీ ఛైర్మన్ బొర్రా కాశీ చేతుల మీదుగా రేషన్ షాపుల వద్దనే నిత్యవసరాలు పంపిణీ చేశారు. పార్టీ గ్రామాధ్యక్షుడు కాగిత బాలాజీ, ఎస్సీసెల్ అధ్యక్షుడు భూపతి రమేష్, బొల్లా రాంబాబు, గురుపాదం, డీలర్ సాకా రాజేష్ పాల్గొన్నారు.



# రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

• ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. కొడాలిలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణ మండపంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సాగు వ్యయం తగ్గించుకునేందుకు ప్రభుత్వం యాంత్రీకరణను ప్రోత్సహిస్తుందన్నారు. ఆధునాతనమైన డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి అనుబంధం చేస్తూ డ్రోన్ల వినియోగం పెంచేందుకు రైతు బృందాలకు 50 శాతం రాయితీపై అందిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా కోటిన్నర మంది రైతులతో ప్రత్యక్ష సంభాషణ చేసేలా 700 జిల్లాల్లో 2వేల శాస్త్రీయ బృందాలతో చేపట్టిన వికసితకృషి సంకల్ప అభియాన్ రైతులకు మేలు చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, టీడీపీ మండలాధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, సర్పంచ్ చలపాటి రాణి, జిల్లా నోడల్ అధికారి సుధారాణి, ఏడిఏ శ్యామల, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ కల్యాణ్ బాబు, ఉద్యానవన శాఖ అధికారిణి జె.కీర్తి, ఏవో కె.మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, భాస్కర్, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పరిశె చలపతి పాల్గొన్నారు.



రైతులకు భూసార పరీక్ష నివేదికలను అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**ప్రమాణ స్వీకార ఏర్పాట్ల పరిశీలన**

సోమవారం కొడాలిలోని ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో జరుగనున్న నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్‌గా తోట కనకదుర్గతోపాటు కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు హాజరవుతారని, విజయవంతం చేయాలని కోరారు.

**యువత క్రీడల్లో రాణించాలి**

అవనిగడ్డ రూరల్: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచించారు. మండలంలోని మోదుమూడిలో ఆదివారం మోదుమూడి ప్రీమియర్ లీగ్ సీజన్-2 (ఎంపీఎల్) రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు యాసం చిట్టిబాబు, జనసేన గ్రామ కన్వీనర్ బచ్చు వెంకట నారాయణ, సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, టోర్నమెంట్ ఆర్గనైజర్ బచ్చు ప్రశాంత్ పాల్గొన్నారు.

**దుర్గా చౌదరి మృతి బాధాకరం**

మోపిదేవి: గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా విశేష కృషి చేసిన రావి పెద్ద బాబూరావు కుమారుడు విశ్రాంత రవాణా శాఖాధికారి రావి దుర్గా చౌదరి (76) మృతి చెందటం బాధాకరమని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవికి చెందిన రావి దుర్గా చౌదరి అస్వస్థతతో ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామమైన మోపిదేవిలో మృతి చెందారు. టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఎమ్మెల్యే దుర్గాచౌదరి మృతదేహం వద్ద నివాళులర్పించారు. సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఎంపీపీ రావి దుర్గావాణి, నేతలు రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి పాల్గొన్నారు.

## అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కాగిత దంపతులు

పెడన రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దావోజిపాలెంలో వేంచేసి ఉన్న విజయ అమలేశ్వరీ దేవి ఏకాదశ క్రతువు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 11ఏళ్లకు ఒకసారి 11 రోజులపాటి జరిగే ఉత్సవాల చివరిరోజున భక్తులు పాల పొంగళ్ల మొక్కులు చెల్లించుకుని అమ్మవారి దీవనలు కోరుకున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైసీపీ పెడన సమన్వయకర్త ఉప్పాల రాము అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

**వైభవంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం**

అవనిగడ్డ రూరల్: మండల పరిధిలోని వేకనూరులో కొలువైన శ్రీ ఉషాపద్మిని సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన శ్రీనివాస్ - కల్యాణి దంపతులు ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

**సుబ్బారాయుడి ఆలయంలో పోటెత్తిన భక్తులు**

మోపిదేవి: మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రాంగణంతోపాటు రహదారి వెంబడి భక్తులు బారులు తీరారు. స్వామికి నిత్య సేవా కార్యక్రమాలు విశేష సంఖ్యలో నిర్వహించారు. ఒక్కరోజు రూ.14,69,900 ఆదాయం లభించినట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు.

**ముగిసిన శ్రీ ఉరువులమ్మ తల్లి జాతర**

నాగాయలంక: మండలంలోని గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉరువులమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. 2 రోజులపాటు జరిగిన ఈ జాతరలో మొదటి రోజున ఉరువులమ్మ తల్లిని గ్రామంలో ఊరేగించి, 2వ రోజున గుడి సంబరం, అన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భక్తులు విరివిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

**పంచాదశ వార్షిక కల్యాణ మహోత్సవం**

బంటుమిల్లి: ఆముదాలపల్లిలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచాదశ వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన పూజ అనంతరం శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. స్వామి గ్రామోత్సవం, భారీ అన్నసమారాధన నిర్వహించారు. వంశంపారంపర్య ధర్మకర్తలు యజ్ఞకులు బ్రహ్మశ్రీ సోమరాజు పల్లి ఈశ్వరశర్మ, అర్చక స్వామి రుద్రపాక లక్ష్మీగోపాలం పాల్గొన్నారు.

**నేడు భద్రావతి సమేత భావనారుషి ఆలయ వార్షికోత్సవం**

పెడన: పట్టణంలోని భద్రావతి సమేత భావనారుషి ఆలయ 11వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అనుముల పూర్ణ, నందం చినబాబు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రత్యేక పూజలు ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం శివశ్రీ ఐలూరి జయకిషోర్ ఆధ్వర్యంలో కొసనం వెంకట సత్యనారాయణ, కరుణకుమారి దంపతులు స్వామి కల్యాణం నిర్వహిస్తారన్నారు. కల్యాణం అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరుగుతుందన్నారు.

## మానవసేవే మాధవసేవ

మచిలీపట్నం టౌన్: మానవసేవయే మాధవసేవ అని పరమహంస పరివ్రాజక అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి అన్నారు. ఆదివారం యతిరాజ భవనంలో జరిగిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ప్రత్యేక అర్చనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిజీ అభిభాషణం చేశారు. నరసాపురానికి చెందిన వెంకటాచార్య స్వామి, ఎంటీ ఆళ్వార్ స్వామి, టీ రఘునాథబట్టర్, పరాశర రామానుజబట్టర్ స్వామి, గుదిమెళ్ల శ్రీకరరామానుజ స్వాములు సైతం అభిభాషణం చేశారు.



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

## సబ్బినేని వరప్రసాద్‌కు సత్కారం

నాగాయలంక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సబ్బినేని బాబూ భవాని వర ప్రసాద్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాగాయలంక జడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్, బాల్ బాడ్మింటన్ క్రీడాకారులు ఆధ్వర్యంలో భవానీ వర ప్రసాద్‌కి దుస్సాలువాను కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. 40 ఏళ్లుగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే కాక, పాఠశాల అభివృద్ధికి వరప్రసాద్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాలరాసిందే వైసీపీ..!

అవనిగడ్డ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రజల హక్కులను కాలరాసి, ప్రశ్నించే వారిని హింసలకు గురి చేసిన వైసీపీ నేతలా రాజ్యాంగ బద్ధ పాలన గురించి మాట్లాడేదని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేత బొబ్బా గోవర్ధన్ ప్రశ్నించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గోవర్ధన్ మాట్లాడుతూ వెన్నుపోటు దినం అంటూ వైసీపీ నేతలు ప్రజలను మోసగించేలా కొత్త డ్రామాలకు తెర తీస్తున్నారన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

బంటుమిల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం అర్తమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగింది. 2007-08 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. అనంతరం ఆ రోజుల్లో జరిగిన గురు శిష్యుల అనుబంధాన్ని స్నేహితుల మధ్య అప్యాయత, అనుబంధాలను నెమరువేసుకున్నారు. పదవీ విరమణ చేసిన విద్యాశాఖాధికారి పరసా పద్మనాభరావు, హెచ్ఎం రామచంద్రరావు, ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గిద్దాం

• మంత్రి కొల్లు రవీంద్ర



చేతి సంచులను కలెక్టర్‌కు అందజేస్తున్న మంత్రి

మచిలీపట్నం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రైతుబజారు, కోనేరుసెంటర్, రేషన్‌డిపో వద్ద చేతి సంచులను పంపిణీ చేశారు. రాజుపేట వద్ద మంత్రి కొల్లు రవీంద్రకు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ చేతి సంచులు అందజేశారు. ప్రధాన సలహాదారుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, గౌరవ డైరెక్టర్ పీ శ్రీరామ్, మానవత మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జీ కిషోర్‌కుమార్, కార్యదర్శి హసీంబేగ్, ఉపాధ్యక్షుడు అయ్యప్ప స్వామి, సభ్యులు ఆదిత్య, కే రాజేంద్రప్రసాద్, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, వీవీ ఫణికుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఝాన్సీ పాల్గొన్నారు.



## స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిని నింపింది

• విజయవాడ గైనకాలజిస్ట్ అసోసియేషన్ వైద్యుల బృందం

చల్లపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, పరిశుభ్రతకు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో నిర్విరామంగా జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి చూసి ఎంతో స్ఫూర్తిని పొందినట్టు విజయవాడ గైనకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ త్రిపురసుందరి, డాక్టర్ సోమలత అన్నారు. ఆదివారం 3487వ రోజు స్వచ్ఛ సేవలో విజయవాడ గైనకాలజిస్ట్ అసోసియేషన్‌కు చెందిన 24 మంది గైనకాలజిస్టుల బృందం, మరో ఆరుగురు వైద్యులు పాల్గొని స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి సేవలందించారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని హైవే పక్కన, కాసానగర్‌లో డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ డీఆర్కే దంపతుల కృషి అసామాన్యమైనదన్నారు. స్వచ్ఛ సేవ ఇంతలా చేస్తారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్వచ్ఛ చల్లపల్లి విశేషాలను డీఆర్కే ప్రసాద్, పద్మావతి వైద్యులకు తెలిపారు. డాక్టర్ సుధాకర్, డాక్టర్ వరుణ్, గైనకాలజిస్టుల బృందం పాల్గొనగా, ఆదివారం స్వచ్ఛసేవలో 74 మంది స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.